ప్రజాశక్తి
శుక్రవారం 20 జూన్ 2025
5
విజయనగరం

గురుకులాల్లో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం, మన్యం జిల్లాల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుండి విజయనగరం జిల్లాలోని 8 గురుకులాల్లో, పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న 5 గురుకులాల్లో దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 25న బాలురకు కొప్పెర్ల, బాలికలకు నెల్లిమర్లలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్సి, ఎస్టి, బిసి, ఒబిసి, వెనుకబడిన తరగతుల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 89858 83015, 63038 38657, 99511 20330 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

- అనర్హత పేరిట వేటు
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న తల్లిదండ్రులు
- వెల్లువెత్తుతున్న దరఖాస్తులు
- అయోమయంలో విద్యాశాఖ
- ఎంతమంది అర్హులో తెలియని అధికారులు

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన 'తల్లికి వందనం' జాబితాలో తప్పుడు డేటా కారణంగా పలువురు ఈ పథకానికి దూరమయ్యారు. భూమి లేకున్నా ఉన్నట్లు, ఒక్కరికే రెండు మూడు విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్టు, అధిక యూనిట్లు వాడినట్టు, ఫోర్ వీలర్ ఉన్నట్టు జాబితాలో రావడంతో వారు పథకానికి అనర్హులయ్యారు. మరోవైపు సరైన ధ్రువపత్రాలు సమర్పించలేదని పలువురికి పథకాన్ని నిలిపివేశారు. వీరే కాకుండా అంగన్వాడీలు, స్కీం వర్కర్లు, మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనం నిలిపి వేయడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. వీటిని సరిదిద్దుకోవడం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

తల్లికి వంచన

ప్రజాశక్తి-సంతకవిటి, గజపతినగరం రూరల్, గంట్యాడ, పూసపాటిరేగ

జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి ఇంటర్ వరకూ చదివే విద్యార్థులు సుమారు 2.25 లక్షల మంది ఉన్నారు. వీరిలో సుమారు 1.95లక్షల మందిని అర్హులుగా గుర్తించారు. సుమారు 50వేల మంది వివిధ కారణాలతో పథకానికి దూరం అయ్యారు. జిల్లాలో సుమారు 10వేల మంది అర్హులుగా ఉన్నప్పటికీ వివిధ కారణాలు చూపి వారిని తల్లికి వందనం పథకానికి దూరం చేశారు. జిల్లాలో ఎంతమంది విద్యార్థులకు పథకాన్ని వర్తింపజేశారో విద్యాశాఖ అధికారులకు తెలియకపోవడం గమనార్హం.

ఆన్‌లైన్ తప్పిదాల వల్ల చాలా మంది అర్హులకు ఈ ఏడాది తల్లికి వందనం వర్తించలేదు. తప్పులను సరిచేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చినప్పటికీ వారంతా సచివాలయాల చుట్టూ దరఖాస్తులు పట్టుకొని తిరుగుతున్నారు. ఇప్పటికే ఇకటికి రెండు సార్లు ఆన్‌లైన్ లో దరఖాస్తులు పెట్టుకోవడానికి తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్తు వినియోగించారనే సాకుతో అనర్హులని డబ్బులు వెయ్యక పోవడంతో పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. విద్యుత్ వినియోగం 100 నుండి 250లోపు యూనిట్లు ఉన్న వారికి కూడా డబ్బులు జమ కాకపోవడంతో అధికారుల తీరుపై మండి పడుతున్నారు. 10ఎకరాల లోపు భూమి ఉన్నవారికి ఎడిట్ ఆప్షన్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. గతంలో భూమి లేక పోయిన భూమి ఉన్నట్టు తప్పులు పడడంతో వారంతా అనర్హుల జాబితాలో చేరారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లకు తల్లికి వందనం తోపాటు పలు సంక్షేమ పథకాలు వర్తించడం లేదు. చాలీచాలని జీతాలకు పనిచేస్తున్న చిరుద్యోగులకు సంక్షేమ పథకాల్లో కోత విధించడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. సంతకవిటి మండలంలో 6885 మంది విద్యార్థులు 'తల్లికి వందనం'కు అర్హులు కాగా 6110 మందికి మాత్రమే డబ్బులు పడ్డాయి. మిగిలిన 775 మందికి వివిధ కారణా లతో అకౌంట్లలో డబ్బులు పడలేదు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సచివాలయాలు, విద్యుత్‌శాఖ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు.

నా ఇద్దరి పిల్లలకూ రాలేదు

నాకు ఇద్దరు కుమారులు. ఒకరు పదో తరగతి పూర్తి చేశాడు. మరొకరు ఇంటర్ రెండో సంవత్సరం చదువు తున్నాడు. మాకు కరెంట్ బిల్లు 300 యూనిట్ లోపే వస్తుంది. అలాగే భూములు అస్సలు లేవు. అయినా తల్లికి వందనం పడలేదు. సచివాలయానికి రెండు రోజులు వెళ్లి దరఖాస్తు చేసుకున్నాను. అయితే తల్లికి వందనం డబ్బులు ఎప్పుడు పడతాయోనని ఎదురు చూస్తున్నాను.

- చింతాడ సూర్యనారాయణ, వాసుదేవపట్నం, సంతకవిటి మండలం

అర్హత ఉన్నా రాలేదు

విద్యుత్ బిల్లు ఎక్కువగా వస్తుందని తల్లికి వందనం ఇవ్వలేదు. నాకు ఎస్సి కేటగిరి సబ్సిడీ ఉంది. నెలకు 30 రూపాయల నుండి 50 రూపాయలు బిల్లు వస్తుంది. రేషన్ కార్డులో నా భార్య పుష్ప, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మా అత్తయ్య రాళ్లపూడి చిన్నతల్లి పేరున కరెంట్ బిల్లు అధికంగా వస్తుందని నాకు తల్లికి వందనం రాదని చెబుతున్నారు. నా కుమారుడు హరిరామ 2వ తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వం నుండి అన్ని పథకాలు వర్తిస్తున్నాయి. తల్లికి వందనం వర్తించకపోవడం బాధాకరంగా ఉంది. మా అత్తయ్య చిన్న తల్లి కరెంట్ బిల్లు ఎక్కువ వచ్చిందని పథకానికి అనర్హులుగా ప్రకటించారు. ఆ బిల్లుతో నాకు ఎటువంటి సంబంధమూ లేదు.

- పాల్తేరు గౌరీశంకర్, గంట్యాడ

సెల్‌కు మెసేజ్ వచ్చినా డబ్బులు పడలేదు

తల్లికి వందనం డబ్బులు వచ్చినట్లు నా సెల్‌కు మెసేజ్ వచ్చింది. డబ్బులు పడ్డాయని అకౌంటు చెక్ చేసుకుంటే అకౌంట్లో డబ్బులు లేవు. మా అమ్మాయి సంగీత పదో తరగతి చదువుతోంది. మా అబ్బాయి సాగర్ ఇంటర్ చదువుతున్నాడు. గంట్యాడ సచివాలయంలో దరఖాస్తు చేశాం.

- రాళ్లపూడి అప్పలనర్సమ్మ, గంట్యాడ

ధ్రువపత్రాలు సరిగా లేవంటున్నారు

నా కుమార్తె పదో తరగతి కెజిబివిలో చదువుతోంది. గతంలో అమ్మ ఒడి డబ్బులు పడ్డాయి. ఇప్పుడు తల్లికి వందనం డబ్బులు పడలేదు. సచివాలయంలో అడిగితే ధ్రువపత్రాలు సరిగా సమర్పించలేదంటున్నారు. ఏ ధ్రువపత్రాలు ఇవ్వాలో చెప్పడం లేదు. అర్హులైన పేదలకు పథకాన్ని వర్తింపజేయకపోవడం సరికాదు. తల్లికి వందనం వర్తింపజేయాలి

- పతివాడ సన్యాసిరావు, పురిటిపెంట, గజపతినగరం మండలం

లేని భూమిని ఉన్నట్లు చూపించారు

నాకు వాస్తంగా 40సెంట్లు భూమి ఉంది. కానీ రికార్డులో 3 ఎకరాలు ఉన్నట్లు చూపించి తల్లికి వందనంను దూరం చేశారు. మీ భూమి పోర్టల్‌లో ఎక్కువ భూమి ఉన్నట్లు లింకు కావడంతో అనర్హులుగా పెట్టారు. అధికారుల తప్పిదాలకు తమను బలిచేయడం సరికాదు.

- బి.నారాయణమ్మ, బంగారమ్మపేట, గజపతినగరం మండలం

300 యూనిట్లు దాటిందని..

నాకు ఇద్దరు పిల్లలున్నారు. నాకు తల్లికి వందనం రాలేదు. ఎందుకు రాలేదని సచివాలయానికి వెళ్తే కరెంట్ బిల్లు ఎక్కువగా ఉందని సమాధానం చెప్పారు. వాస్తవంగా చూస్తే, మా ఇంట్లో ప్రతినెలా 200 యూనిట్ల లోపే విద్యుత్ వినియోగం జరుగుతుంది. అయినా రికార్డులో 300 యూనిట్లు పైగా వాడుతున్నట్లు ఉంది. బిల్లులో తప్పుల వల్ల పథకాన్ని కోల్పోయాను. వాస్తవ రీడింగ్ ఆధారంగా పథకాన్ని వర్తింపజేయాలి.

- ఎరుకొండ రామలక్ష్మి, పూసపాటిరేగ గ్రామం

పదెకరాలు ఉన్నట్లు తప్పు చూపారు

నాకు ఒక్క సెంటు భూమి కూడా లేనప్పటికీ మీ భూమి పోర్టల్‌లో ఆధార్‌కు 10 ఎకరాలు ఉన్నట్లు లింకు కావడంతో డబ్బులు పడలేదు. ఈ పథకం కింద డబ్బులు వస్తాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. పేదలకు అన్యాయం చేయడం సరికాదు. ఇద్దరు పిల్లలను ఎలా చదివించాలి.

- కొర్నాన జయమ్మ, బంగారమ్మపేట, గజపతినగరం మండలం

ర్యాలీ చేపడుతున్న సిఐటియు నాయకులు, ఇంజినీరింగ్ కార్మికులు

ఇంజినీరింగ్ కార్మికులకు బేసిక్ వేతనం ఇవ్వాలని

సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్ వాటర్ వర్క్స్, పర్యావరణ, ఎలక్ట్రికల్, నాన్ పిహెచ్ కార్మికులందరికీ బేసిక్ వేతనం రూ.21వేలు, టెక్నికల్ వేతనం రూ.24,500 చెల్లించాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం బాలాజీ నగర్ వాటర్ ట్యాంక్ నుంచి కొత్తపేట వాటర్ ట్యాంక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎ.జగన్మోహన్రావు, ఎస్.రామునాయుడు, భాస్కర్‌రావు, వెంకటేష్ మాట్లాడారు. మున్సిపల్ ఇంజిఇనీరింగ్ నాన్ పిహెచ్ కార్మికులకు ప్రభుత్వం జీతాలు పెంచుతూ తక్షణమే జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, రిటర్మెంట్ బెనిఫిట్, 62 సంవత్సరాల వరకు కొనసాగింపు, థర్డ్ పార్టీ కార్మికులకు అప్కాస్ కార్మికులతో సమానంగా వేతనాలు ప్రతినెల 10వ తేదీలోపు చెల్లించాల న్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం, అధికార యంత్రాంగం సానుకూలంగా స్పందించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏ రోజు నుంచి సమ్మె చేస్తే ఆ రోజు నుంచి విజయనగరంలో ఇంజనీరింగ్ వాటర్ సప్లై కార్మికులందరూ కూడా సమ్మెకు సిద్ధం కాబోతున్నారని హెచ్చరించారు. ర్యాలీలో ధనుంజయ, సత్యనారాయణ, రాజు, ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీచేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి బబిత

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

వచ్చేనెల 5న తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్ ఎం.బబిత అన్నారు. గురువారం విజయగనరం, పార్వతీపురం జిల్లాలోని న్యాయమూర్తులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద భీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు, ఎగ్జిక్యూషన్ పిటిషన్, ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సైజ్ కేసులు, ల్యాండ్ కేసులు, కుటుంబ తగాదాలు, వాటర్ కేసులు, మున్సిపాలిటీ, ప్రీ లిటిగేషన్ కేసులు, ఇరు పార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చేయాలని సూచించారు. కార్యక్రమలో సీనియర్ సివిల్‌జడ్జి ఎ.కృష్ణ ప్రసాద్, ఉమ్మడి జిల్లాల న్యాయమూర్తులు,బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించాలి

ప్రజాశక్తి - వంగర

మత్స్యకార సొసైటీ ఎన్నికలు నిర్వహించేటప్పుడు చేతులెత్తే పద్ధతి కాకుండా బ్యాలెట్ ఓటింగ్ పద్ధతి నిర్వహించాలని 227 మంది మత్స్యకారులు సంతకాలు చేసి ఆమోదం తెలిపినట్లు మత్స్యశాఖ రాజాం అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ (ఎఫ్‌డిఒ) గురువారం తెలిపారు. మండలంలో గల శ్రీసీతారామ మత్స్యకార సొసైటీ పదవీకాలం ముగియడంతో కొంతమంది మత్స్యకారులు జిల్లా కలెక్టర్‌ను కలిసి గతంలో మత్స్యకార సొసైటీ ఎన్నికలు చేతులెత్తే పద్ధతిలో నిర్వహించే వారిని ఆ విధంగా కాకుండా బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించాలని కోరడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని మగ్గూరు సమీపంలో వివిధ గ్రామాలకు చెందిన మత్స్యకారులతో అధికారులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు గ్రామాలకు చెందిన మత్స్యకారులు పాల్గొని ఎన్నికలు నిర్వహించేటప్పుడు బ్యాలెట్ ఓటింగ్ పద్ధతి నిర్వహించాలని కోరుతూ చేతులెత్తి ఆమోదం తెలపడంతో పాటు, అధికారుల సమక్షంలో సంతకాలు చేసి ఆమోదం తెలిపారు. అతి తక్కువ మంది మాత్రం వెనుదిరిగి వెళ్ళిపోయారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికార సిబ్బంది, మత్స్య కార సొసైటీ మాజీ అధ్యక్షుడు పెనుబోతు దుర్గారావు పాల్గొన్నారు.

తాటిపూడి రిజర్వాయర్ వద్ద యోగాసనాలు వేస్తున్న మంత్రి శ్రీనివాస్, అధికారులు, నాయకులు, విద్యార్థులు

సాంస్కృతిక, వారసత్వ సంపద యోగా

ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ • తాటిపూడి జలాశయం వద్ద యోగా ప్రదర్శన

ప్రజాశక్తి-గంట్యాడ

భారతీయుల వారసత్వ, సాంస్కృతిక సంపదైన యోగాను నేడు యావత్ ప్రపంచం అనుసరిస్తోందని, తద్వారా సమగ్రమైన, ప్రశాంతమైన, సంతృప్తికరమైన జీవనశైలి వైపు పయనించే అవకాశం ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న,మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం గంట్యాడ మండలం తాటిపూడి జలాశయం వద్ద జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి మంత్రి కొండపల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో యోగా సాధన భాగం కావాలని సూచించారు. క్రమబద్ధమైన జీవనాన్ని అలవర్చుకోవటం ద్వారా ఒత్తిడికి దూరంగా ఉండవచ్చునని తెలిపారు. విద్యార్థులు వారి జీవనంలో యోగాను భాగం చేసుకోవాలని మంత్రి సూచించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించి అన్ని రంగాల్లో ఎదిగేందుకు దోహదపడు తుందన్నారు.

విశాఖపట్నం సముద్రతీరంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించటం ద్వారా అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావటం ఖాయమని మంత్రి అన్నారు. కార్యక్రమంలో డిఇఒ మాణిక్యం నాయుడు, డిఎంహెచ్ఒ ఎస్.జీవనరాణి, పర్యాటక శాఖ అధికారి కుమారస్వామి, జిల్లా ఆయుష్ అధికారి ఆనందరావు, మెప్మా పీడీ చిట్టిరాజు, గ్రామ, వార్డు సచివాలయ శాఖ నోడల్ అధికారి రోజారాణి, సీడీపీవో ఉమాభారతి, ఎంపిడిఒ ఆర్‌వి రమణ, గొట్టిపాటి బుచ్చి అప్పారావు జలాశయం ఆయకట్టుదారుల సంఘం చైర్మన్ జగన్నాథం, ఉపాధి ఎపిఒ సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ప్రయివేటు పాఠశాలలకు రెండు రోజులు సెలవులు : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి విజయవంతం చేయాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ తో కలసి మంత్రి వెబెక్స్ ద్వారా ఎంపిడిఒలు, లైజన్ అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేసారు. ప్రతి బస్సు లో మెడికల్ కిట్ ను ఏర్పాటు చేయాలని, వాటర్ బాటిల్స్‌ను, ఎఎన్ఎంలను కూడా నియమించాలని తెలిపారు. బస్సులు 5.30 లోపలే వేదికల వద్దకు చేరేలా చూడాలని తెలిపారు. కార్యక్రమం అనంతరం ట్రాఫిక్ సమస్య తలెత్తి ఆలస్యం అయ్యే అవకాశం ఉందని, బ్రేక్ ఫాస్ట్ ను కూడా బస్సులలో ఏర్పాటు చేయాలని కోరారు.

జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ 21 న జిల్లాలో చేసే యోగ కార్యక్రమానికి 5714 చోట్ల 9,63,450 మందితో యోగా కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విశాఖపట్నం లో జరిగే కార్యక్రమానికి జిల్లా నుండి 30వేల మందిని పంపిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నుండి విశాఖకు 660 బస్సులను ఏర్పాటు చేసామని, ఈ బస్సులు ఉదయం 2.30గంటలకల్లా తప్పని సరిగా ప్రారంభం కావాలని ఎంపిడిఒలకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసామని తెలిపారు. ప్రతి మండలానికి ఇద్దరేసి అధికారులు ఇంచార్జ్‌లుగా కంట్రోల్ రూమ్ లో రాత్రంతా పని చేస్తామన్నారు. బస్సులలో మహిళలు, బాలికలు వెళ్ళే బస్సు లకు మహిళా పోలీస్ ను కేటాయించాలని ఎస్పిని కోరారు. సమావేశంలో ఎస్పి వకుల్ జిందాల్, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, సిపిఒ బాలాజీ, డిప్యూటీ రవాణా కమిషనర్ మణికుమార్, జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, డిఇఒ మాణిక్యం నాయుడు, డిపిఒ మల్లికార్జునరావు, ఎస్ఎస్ఎ పీవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

2 రోజులు సెలవు

విశాఖపట్నంలో ఈనెల 21 న నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి బస్సులు తరలించడం వలన జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలకు ఈనెల 20, 21 తేదీలలో సెలవులు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు.

యోగాంధ్ర ట్రయల్ రన్ విజయవంతం

- పల్లెవెలుగు బస్సులో ప్రయాణించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే
- జిల్లాకు 30 కంపార్టుమెంట్లు, 4 చోట్ల పార్కింగ్ స్థలాల ఏర్పాటు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

యోగాంధ్ర ట్రయల్ రన్ విజయవంతంగా జరిగింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో జిల్లా నుండి 16 బస్సులతో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, లైజన్ అధికారులు బస్సు లో ప్రయాణించారు. కలెక్టర్ అయినప్పటికీ అంబేద్కర్ సాధారణ ఉద్యోగిలా పల్లెవెలుగు బస్సులో అందరితో పాటు ప్రయాణించడం విశేషం. రహదారి మధ్యలో జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ , ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి , జే.సి సేతుమాధవన్, అదనపు ఎస్.పి సౌమ్య లత, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, వేదికల ఇంచార్జ్ రోణంకి కూర్మనాథ్, తదితరులు బస్సులో ఎక్కి కలెక్టర్ తో పాటు వేదిక వరకు ప్రయాణం చేసారు. వేదికల వద్దకు వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ బస్సు లు జాతీయ రహదారి గుండా ప్రయాణించి మారికవలస నుంచి తిమ్మాపురం బీచ్ వద్దకు చేరుకొని బస్సు రూట్లను, దిగే స్థలాలను, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. జిల్లా నుండి బయలు వెళ్లే 660 బస్సు ల కోసం తొట్ల కొండ, ఎపిఐఐసి హిల్స్, బావి కొండలు, ఐటి హిల్స్ వద్ద 4 చోట్ల పార్కింగ్ కోసం కేటాయించారు. జిల్లాకు 30 కంపార్ట్మెంట్‌లు కేటాయించారు. సుమారు వెయ్యి మందికి ఒక కంపార్ట్మెంట్ చొప్పున కేటాయించి, ప్రతి కంపార్ట్మెంట్ కు ఒక ఉన్నతాధికారి, పోలీస్ బందోబస్త్, ఒక ఇంచార్జ్ అధికారిని నియమించారు.

ఆరోగ్యం కోసం యోగా చేయాలి

బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత • గురుకుల పాఠశాల సందర్శన

విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆరోగ్యం కోసం ఆడపిల్లలు సైతం యోగాను అభ్యసించాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవితో కలిసి గురువారం ఆమె స్థానిక ఎంజెపి బిసి బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించారు. ఉపాధ్యాయులతోనూ, విద్యార్థిను లతోనూ విడి విడిగా సమావేశమై మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. జ్యోతి బా పూలే చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పిల్లలు తయారుచేసిన పలు ప్రయోగాలను ఆమె పరిశీలించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా తమ కళాశాలలో ఇంటర్ తరగతుల నిర్వహణ కోసం ప్రత్యేక తరగతి గదులు నిర్మించాలని, కళాశాలకు వచ్చే రోడ్డును బాగు చేయాలని ప్రిన్సిపాల్ కె.బిబిరావు ఆమెకు వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన పలు పిరమిడ్ ఆకృతులను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. పిరమిడ్లు వేసిన చిన్నారుల దగ్గరకు వెళ్లి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగ అభివృద్ధి కోసం తమ కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో విద్యా రంగం నిర్వీర్యమైపోయిందని, తమ ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ఇంటిలో ఎంత మంది విద్యార్థులుంటే అంతమందికీ 'తల్లికి వందనం' అమలు చేశామని వివరించారు. ఒక్కో విద్యార్థికి రూ.2500 విలువైన కిట్లను అందజేశామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 106 గురుకుల పాఠశాలలు గతంలో తమ తెలుగు దేశం ప్రభుత్వాలు ఏర్పాటు చేసినవేనని గుర్తు చేశారు. రాష్ట్ర స్థాయిలో ఇంటర్మీడియేట్ పరీక్షల్లో బిసి గురుకులాలు మొదటి స్థానంలో నిలవడం గర్వంగా ఉందని ఆమె అన్నారు. ఈ నెల 21వ తేదీన విశాఖలో జరుగునున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని సకాలంలో హాజరు కావాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్ పర్సన్ బంగారు సరోజినీ, జనసేన నాయకుడు కరుమజ్జి గోవిందరావు, పార్టీ నాయకులు ఎడ్ల గోవిందరావు పతివాడ గోవిందరావు, రవ్వా నాని, అప్పికొండ రవికుమార్, బిజెపి నాయకుడు బూర్లె శ్రీధర్, అధ్యాపకులు, ఇన్ఛార్జ్ ఆర్‌టిఒ సవరమ్మ, డిప్యూటీ ఎంపిడిఒ శంకర్ జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఏపిఎంగా నారాయణరావు

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

వెలుగు గజపతినగరం మండల ఏపిఎంగా పి.నారాయణరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నారాయణరావు గరివిడి మండలంలో ఎపిఎంగా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల అభివృద్ధికి, ఎస్‌హెచ్‌జి మహిళల సాధికారతకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఇంతవరకు ఇక్కడ ఏపిఎంగా పనిచేసిన సత్యనారాయణ బదిలీపై వెళ్లారు.

22న ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో పెదమేడపల్లి సచివాలయం వద్ద ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ కార్యదర్శి రేవంత్ ఒక ప్రకటనలో తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో కంటి సంబంధిత సమస్య ఉన్నవారు తనిఖీలు చేసుకోవాలని కోరారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు తీసుకొని రావాలని సూచించారు.

నేడు మెంటాడ మండల సమావేశం

మెంటాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎ.భానుమూర్తి తెలిపారు. ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని అధికారులు తమ ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు హాజరుకావాలని కోరారు.

విత్తనాలు పంపిణీ

డెంకాడ : మండలంలోని గునుపూరుపేట, చొల్లంగిపేట, సింగవరం, డెంకాడ, అమకాం గ్రామాల్లో గురువారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. అమకాంలో ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు విత్తనాలు పంపిణీ చేశారు. ఆయా గ్రామ ఎంపిటిసిలు, సర్పంచులు, జనసేన, టిడిపి నాయకులు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

మహిళల కుట్టుమిషన్ శిక్షణ పరిశీలన

ప్రజాశక్తి- రేగిడి

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహిస్తున్న మహిళల కుట్టు మిషన్ శిక్షణను గురువారం ఎంపిడిఒ శ్యామల కుమారి పరిశీలించారు. కుట్టు మిషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకున్న 120 మందిలో 30 మంది మొదటి విడతగా శిక్షణలో ఉన్నారు. 90 రోజులు పూర్తయిన అనంతరం కుట్టు మిషన్, ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ ధ్రువీకరణ పత్రంతో బ్యాంకులో రుణం పొందవచ్చు అన్నారు. ఎంపిడిఒతో పాటు ఎపిఎం బాసిన గోవిందరావు ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గురువారం శ్రీసత్యసాయి దివ్యామృతం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ 126 మందికి పరీక్షలు చేశారు. 30 మందికి కేన్సర్ స్ర్కీనింగ్, 30 మంది బ్రెస్ట్ కేన్సర్, 20 మందికి ఒఆర్ఎల్ పరీక్షలు చేశారు. ముగ్గురికి కేన్సర్ అనుమానితులుగా గుర్తించి, మహాత్మా గాంధీ కేన్సర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. 28 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. పది మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నాయుడు, మాజీ సర్పంచ్ గంగాభవాని, తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డుకు శంకుస్థాపన

వేపాడ : మండలంలోని సోంపురం గ్రామంలో సిసి రోడ్డు పనులకు గురువారం ఎంపిపి డి.సత్యవంతుడు శంకుస్థాపన చేశారు. మండల పరిషత్తు నిధులు రూ.2 లక్షలతో ఈ సిసి రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సోంపురం సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపిటిసి ఆకుల సత్తిబాబు, గ్రామ నాయకులు తొండవరపు మల్లేశ్వరరావు, పల్లి కాళీ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు వేపాడ మండల సమావేశం

వేపాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి డి.సత్యవంతుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ తెలిపారు. గత సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలపై సమాధానాలతో అధికారులు సిద్ధం కావాలని సూచించారు. సంబంధిత రికార్డులతో అధికారులు అందరూ హాజరు కావాలని కోరారు.

దళిత సర్పంచ్‌ను అవమానించిన
ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

దళిత సర్పంచ్‌ని అవమానించిన ఎమ్మెల్యే పార్థసారథి, బిజెపి, టిడిపి నాయకులపై చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోవాలని డిబిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి జయశంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల్ని, ప్రభుత్వాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే ఇంతటి అవమానాలకు గురిచేస్తే, ఇక ఎస్‌సి, ఎస్‌టి చట్టాలను వీరు ఏం కాపాడతారని ప్రశ్నించారు. బిజెపి ఎమ్మెల్యే పార్థసారథితోపాటు నాయకులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుని పెద్ద మనసు

వేపాడ : మండలంలో దబ్బిరాజుపేటలోని మండల పరిషత్తు మోడల్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయులు రెడ్డి శంకర్రావు పెద్దమనసు చాటుకున్నారు. ఆ పాఠశాలలో చదువుతున్న 60 మంది విద్యార్థులకు సుమారు రూ.10 వేలతో నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, తదితర సామగ్రిని గురువారం అందజేశారు. విద్యార్థులంతా మంచిగా చదువుకొని ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వరప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎఐఎఫ్ ఎక్స్‌పోజర్ విజిట్‌కు బంగారయ్య

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపుపేట జడ్‌పి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు శివకు బంగారయ్య చిత్తూరు జిల్లా, కుప్పం నియోజకవర్గం, గుడిపల్లి 'అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్'కి గణితానికి సంబంధించి 'ఎక్స్‌పోజర్ విజిట్'కి వెళ్లారు. ఈనెల 16 నుండి 18 వరకు జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రం నుండి 60 మంది మ్యాథ్స్, సైన్స్ ఉపాధ్యాయులను ఎస్ఇఆర్‌టి పంపింది. 'మేక్ యువర్ ఓన్ ల్యాబ్'లు ఏర్పాటు చేయడంపై పలు గణిత అంశాలను తయారు చేసి ప్రదర్శన వచ్చారు. ఈమేరకు బుధవారం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నుండి సర్టిఫికెట్, బ్యాడ్జిలను అందుకున్నారు.

ఘోషాసుపత్రికి 30 లక్షల విలువైన పరికరాలు పంపిణీ

కంటోన్మెంట్ : సామాజిక సేవయే ధ్యేయంగా ఎన్నో పాఠశాలలకు, ఆసుపత్రులకు, అనాథాశ్రమాలకు, వృద్ధాశ్రమాలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామ రాజు గురువారం కేంద్రమాజీమంత్రి పి.అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మితో కలసి ఘోషా ఆసుపత్రికి రూ.30లక్షలు విలువగల వైద్య పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి పాకలపాటి రఘు వర్మ, ఐఎంఎ రాష్ట్ర నాయకులు డాక్టర్ జె.సి.నాయుడు, జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట అప్పలనాయుడు, టిడిపి నాయకులు ఐవిపి రాజు, అనురాధ బేగం పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరం

కంటోన్మెంట్: మాదక ద్రవ్యాలను తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమని ఎక్సైజ్ విజయనగరం టౌన్ సిఐ కె.మన్మథరావు తెలిపారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విజయనగరం రైల్వేస్టేషన్ వద్ద ఆటో స్టాండ్‌లో ఆటో డ్రైవర్లకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.రాజకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

మెంటాడ : వ్యవసాయంలో పంట మార్పిడితోనే అధిక దిగుబడులు సాధ్యమని ఏరువాక కేంద్రం ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త లక్ష్మణ్ అన్నారు. విజయనగరం ఏరువాక కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పెదచామాపల్లిలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పంటల్లో సరైన మార్పులు తీసుకొస్తే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఆయన తెలిపారు.

సదస్సులో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు

విద్యా వ్యతిరేక విధానాలను మానుకోవాలి

ఎస్ఎఫ్ఐ సదస్సులో యుటిఎఫ్ నాయకులు మోహన్‌రావు

ప్రజాశక్తి-రాజాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాని నాశనం చేసే విధానాలను మానుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు డిమాండ్ చేశారు. కేరళలో జరుగనున్న ఎస్ఎఫ్ఐ 18వ అఖిలభారత మహాసభల సందర్భంగా రాజాంలో గురువారం విద్యాసదస్సు నిర్వహించారు. తొలుత ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా సహాయ కార్యదర్శి పి రమేష్ ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య వక్తలుగా ఎస్ఎఫ్ఐ జిల్లా పూర్వ కార్యదర్శి ప్రస్తుత సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్ రావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో విద్యారంగంలో వచ్చే సమస్యలపై నిస్వార్థంగా పోరాటం చేసే ఏకైక విద్యార్థిసంఘం ఎస్ఎఫ్ఐ మాత్రమేనని అన్నారు. జిల్లాలో సంక్షేమ హాస్టల్స్ ఉన్నాయన్నా, రాజాం, గజపతినగరం, విజయనగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు జరిగాయన్నా, కేంద్రీయగిరిజన విశ్వవిద్యాలయాన్ని ఈ జిల్లాలో ప్రారంభం చేశారన్న ఆ ఘనత ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితం మాత్రమేనని తెలిపారు. ప్రస్తుతం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యతిరేక విధానాలు తీసుకొస్తున్నాయని, ప్రధానంగా నూతన జాతీయ విద్యావిధానం పేరుతో విద్యను పూర్తిగా కాషాయకరణ, కార్పొరేటీకరణ చేస్తుందని విమర్శించారు. విద్యను నాశనం చేసే విధానాలు మానుకోపోతే మహాసభల స్ఫూర్తితో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. సదస్సు అనంతరం రాజాం మండల కమిటీ ఆధ్వర్యంలో అఖిలభారత మహాసభల పోస్టరు ఆవిష్కరించారు. సదస్సులో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకీ, శిరీష, వంశీ, సోమేశ్, రమణ, గౌరి, నాని తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక మార్పులను తిప్పికొట్టండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

పజాశక్తి - వంగర

సమావేశంలో మాట్లాడుతున్నసిఐటియు నాయకులు కె.సురేష్

కార్మిక వ్యతిరేక మార్పులను తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సిహెచ్.రూపావతి అధ్యక్షతన సిఐటియు మండల సమావేశం గురువారం నిర్వహించారు. విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షులు వై.అప్పలస్వామి మాట్లాడుతూ విఆర్‌ఎలకు, స్కీమ్ వర్కర్లకు ఇచ్చిన హామీను ఈ రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. దీనిపై భవిష్యత్తులో అన్ని సంఘాలు ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే సురేష్ మాట్లాడుతూ బ్రిటీష్ కాలం మాదిరిగా మరలా కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం దిగజారిందన్నారు. రోజుకు పని గంటలు 8 నుండి 10కు పెంచడం, ఓటి దాదాపు రెట్టింపునకు పెంచడం నష్టదాయక మన్నారు. వీటిని కార్మికవర్గం ఐక్య పోరాటాలతో తిప్పి కొట్టాలన్నారు. ఈ సవరణల వల్ల రాష్ట్రంలోని ఫ్యాక్టరీలు, షాపులు సంస్థల్లో పనిచేసే 50లక్షల మంది కార్మికులు పెద్దఎత్తున నష్టపోతారన్నారు. ఈ ప్రతిపాదన చట్టం కాకుండా కార్మికవర్గం అడ్డుకోవాలన్నారు. 8గంటల పనిని 10.30గంటలలో విస్తరించవచ్చన్న నియమాన్ని ఇపుడు 12 గంటలకు పెంచారన్నారు. వామపక్ష పార్టీలు అధికారంలో ఉన్న కేరళ మినహా కేంద్రంలో, రాష్ట్రంలోనూ మిగతా రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేకమైన సవరణలు చేయడం ఇటీవల కాలంలో కనిపిస్తోందన్నారు. కర్నాటకలో అంతకు ముందు ఉన్న బీజేపీ ప్రభుత్వం వారపు పని గంటలు 48 ఉంచి, రోజు పని గంటలను అవసరాన్ని బట్టి పెంచుకోవడమో లేదా తగ్గించడమో చేయవచ్చని చట్టాన్ని మార్చిందన్నారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దు చేయకుండా అలాగే ఉంచిందన్నారు. రాష్ట్రంలో కూడా వైసిపి, టిడిపి ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక సవరణలను చేయడమో లేక వాటికి మద్దతునివ్వడమో చేస్తున్నాయన్నారు. ఈ సమయంలో రాజకీయాలకు అతీతంగా ఐక్య పోరాటానికి జూలై 9 జరిగే సమ్మెకు కార్మికవర్గం సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.త్రినాథ్, యూనియన్ నాయకులు భారతి, సుశీల, గొడబ అప్పలస్వామి, పి.పైడితల్లి, కే.ఉదయ్ కుమార్, డి.వీరేశం తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి కుమార్తె చదువుకు ఎమ్మెల్యే సాయం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ఇచ్చిన మాటకు కట్టుబడి, టిడిపి నాయకుడి కుటుంబానికి అండగా నిలిచారు... ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ దాకా దేముడునాయుడు కొంతకాలం క్రితం అనారోగ్యంతో మరణించారు. ఆ సమయంలో ఆయన కుమార్తె చదువు బాధ్యత తీసుకుంటానని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కోళ్ల లలితకుమారి దంపతులు గురువారం దేముడునాయుడు కుమార్తె గ్రీష్మకు చదువు నిమిత్తం ఆర్థిక సాయం చేశారు. మూడేళ్ల వరకు రూ.1.50 లక్షలు చెల్లించి తన చదువు బాధ్యత తీసుకుంటానని ప్రకటించడంతో గడిచిన రెండేళ్ల కాలానికి రూ.లక్ష, మూడో ఏడాది విద్యా సంవత్సరానికి రూ.50 వేలు చెల్లించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే దంపతులు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు రంగాపురం గ్రామస్తులు, పార్టీ నాయకులు.. వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తవలస ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరరావు, కొట్యాడ ఈశ్వరరావు, దాకారపు ముత్యాల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పూల్‌బాగ్ రోడ్డు మరమ్మతులకు చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

పూల్‌బాగ్ రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బేబినాయన.. మున్సిపల్ అధికారుల ను ఆదేశించారు. రాజా కళాశాల నుంచి పూల్‌బాగ్ జంక్షన్ వరకు రోడ్డుపై పెద్ద గోతులు ఉండడంతో గురువారం పరిశీలించారు. రోడ్డుపై గోతులను పూడ్చేందుకు ప్రతిపాదనలు చేసి పనులు చేపట్టాలని సూచించారు. ఆయనతో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్, టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కమిషనర్ రామలక్ష్మి, ఇంజినీరింగ్ అధికారులు, నాయకులు ఉన్నారు.

సాయికృష్ణకు సత్కారం

యోగాంధ్ర చిత్రలేఖనం పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన విజేత సాయికృష్ణను కోటలో ఎమ్మెల్యే బేబినాయన అభినందించారు. యోగాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు.

అన్నదాతకు అన్యాయం చేయొద్దు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అన్నదాత సుఖీభవ పథకంలో నిబంధనలు పేరిట రైతులకు అన్యాయం చేయడం దుర్మార్గమని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వం చేపట్టిన భూ సమగ్ర సర్వేతో ఇప్పటికీ రైతులు ఇబ్బందులు పడి సంక్షేమ పథకాలకు నోచుకోలేక పోతున్నారని తెలిపారు. నిబంధనల పేరిట ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని నిర్వీర్యం చేయకుండా రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సిరమ్మ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కొత్తపేటలో ఉన్న సంపత్ వినాయకుని ఆలయం, పైడితల్లి అమ్మవారి ఆలయాలను సందర్శించి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం సిరి సహస్ర రైసింగ్ పేలస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. విజయనగరంలోని చెవిటి, మూగ పాఠశాలలో కేక్ కటింగ్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. హిజ్రాస్ కొండబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన చీరలు పంపిణీ, వికలాంగులకు వీలు చైర్స్ పంపిణీ, అన్నదానం కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రశాంతంగా మండల సమావేశం

గజపతినగరం రూరల్ : ఎపిపి బెల్లాన జ్ఞాన దీపిక అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికల వివరించారు. పలు గ్రామాల సభ్యులు తమ ప్రాంతాల్లోని సమస్యలను ప్రస్తావించగా, వాటిని అధికారులు పరిష్కరించాలని ఎంపిపి సూచించారు. ప్రజల నిత్యజీవితాన్ని ప్రభావితం చేసే సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో జెడ్‌పిటిసి గార తవుడు, ఎంపిడిఒ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీవన చైతన్య దీప్తి యోగా : డివిజి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

మనస్సు,శరీరం,ఆత్మలను యోగ సంయోగపరిచి చైతన్యం కలిగిస్తుందని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. నగరంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బొలికోన్నత ఆశ్రమ పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల యోగ ప్రదర్శనను వీక్షించడంతో పాటు స్వయంగా ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయుల జీవన విధానంలో యోగా అంతర్భాగమైందని వర్తమాన జీవన విధానంలో ఒడిదుడుకులను తట్టుకుకోవడానికి ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా ఎంతో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.ఉమాలక్ష్మి, పీడీ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి : కమిషనర్

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సచివాలయ కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. గురువారం సచివాలయ కార్యదర్శులతో విడతల వారీగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 విశాఖపట్నంలో నిర్వహించ తలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని శతశాతం విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులకు నిర్దేశించిన విధంగా ప్రజలను యోగ వేదికల వద్దకు తరలించాలని సూచించారు. ఆరోజు ఉదయం 3గంటలకే తప్పనిసరిగా సచివాలయాల నుండి బస్సులు ప్రజలతో తరలించాలన్నారు. ప్రతి సచివాలయం నుండి కనీసం 300 మందిని సిద్ధం చేయాలన్నారు. అదేరోజు సచివాలయాల పరిధిలో ఉదయం 6:30 గంటలకు యోగా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం రాజీవ్ స్టేడియంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పారు. సమావేశంలో టిపిఆర్‌ఓ సింహాచలం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్నకమిషనర్ నల్లనయ్య

యోగా ద్వారా మెరుగైన ఆరోగ్యం

యోగా ద్వారా శారీరకంగా, మానసికంగా మెరుగైన ఆరోగ్యం లభిస్తుందనినగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. గురువారం కోట వద్ద యోగాసనాలను నిర్వహించారు.

తాగునీటి సమస్యపై ఎమ్మెల్యేను నిలదీత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎమ్మెల్యే మాధవిని నిలదీస్తున్న మహిళలు

నగర పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు ఎమ్మెల్యేను నిలదీశారు. గురువారం స్థానిక ఎంజెపి గురుకుల పాఠశాలకు ఎమ్మెల్యే లోకం నాగమాధవి వచ్చిన నేపథ్యంలో నగర పంచాయతీకి చెందిన మహిళలు ఒక్కసారిగా తాగు నీటి సమస్య పరిష్కరించాలని నిలదీశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ గత నెల రోజులుగా పలు వార్డుల్లో తాగునీరు సరఫరా జరగక ఇబ్బందులు పడుతున్నా ప్రజా ప్రతినిధులు, అధికార్లు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిమ్మల్ని గెలిపించినందుకు మాకు తాగునీరు లేకుండా చెస్తారా ఇదేనా మీరిచ్చిన బహుమానం అని మండిపడ్డారు. మరమ్మత్తులు చేస్తున్నామని కాలయాపన చేసి నగర పంచాయతీ ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. మినిస్టర్ ప్రోగ్రాం ఉంది మీ వార్డుకి వచ్చి మాట్లాడుతాను అని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి చెప్పగా మహిళలు మాట వినకుండా మంత్రికి నీటి సమస్య పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.

పొదుపు, అప్పుల వివరాలు నమోదు చేయాలి

సెర్ప్ అడిషనల్ సిఇఒ శ్రీరాములునాయుడు

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములునాయుడు

స్వయం సహాయక సంఘాల్లో ఉన్న సభ్యుల పొదుపు, అన్ని రకాల అప్పులను పూర్తి సమాచారంతో సెర్ప్ ఎస్‌హెచ్‌జిహెచ్ 2.0 లో నమోదు చేయాలని సెర్ప్ అడిషనల్ సిఇఒ శ్రీరాములునాయుడు తెలిపారు. వెలుగు కార్యాలయంలో గురువారం సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాప్ లో సమాచారం నమోదు చేయడంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. స్వయం సహాయక సంఘాల్లో ఉండే మహిళలకు ఆన్‌లైన్‌లో చేర్చడం ద్వారా వారి అప్పులు, పొదుపులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ఉపయోగ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎపిడి కె.సావిత్రి, శ్రీనిధి డిజిఎం కృష్ణంనాయుడు, ఎజిఎం చిట్టిబాబు, ఎపిఎం నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అప్రమత్తం

డిఎంహెచ్‌ఒ జీవనరాణి

ప్రజాశక్తి-మెంటాడ

అవగాహన సదస్సుల మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ జీవనరాణి

సికిల్‌సెల్ ఎనీమియాపై అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్‌ఒ జీవనరాణి తెలిపారు. ప్రపంచ సికిల్‌సెల్ వ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉయ్యాడవలసలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం పోస్టర్లు, పుస్తకాలు ప్రారంభించారు. జిల్లా క్షయ నివారణ అధికారి కె.రాణి, మెంటాడ పిహెచ్‌సి వైద్యాధికారి జె.లోకప్రియ, ఎంపిడిఒ భానుమూర్తి మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో లోతుగెడ్డ సర్పంచ్ సారా భీమారావు, ప్రభుత్వ శాఖల సిబ్బంది, ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం సికిల్ సెల్ వ్యాధి పరీక్షల శిబిరంలో నిర్వహించారు. ఆంద్ర గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు కలిసి ర్యాలీ చేపట్టారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు: ఆర్‌డిఒ

ప్రజాశక్తి - వంగర

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని చీపురుపల్లి ఆర్‌డిఒ బి.ఆశయ్య రెవెన్యూ సిబ్బందిని హెచ్చరించారు. ఈనెల 18న మండల పరిషత్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో రెవెన్యూ శాఖ అధికారులపై ప్రజా ప్రతినిధులు తీవ్రస్థాయిలో ఆరోపణ చేయడంతో పలు పత్రికల్లో వచ్చిన కథనాలకు జిల్లా కలెక్టర్ స్పందించి మండల రెవెన్యూ పరిస్థితిపై తెలుసుకోవాలని ఆర్‌డిఒను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆర్‌డిఒ వంగర చేరుకొని రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుతం వంగరకు తహశీల్దార్ లేకపోవడంతో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలతో పాటు, క్యాస్ట్ సర్టిఫికెట్లు సంతకాల కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారని తహశీల్దార్‌ని ఎప్పుడు నియమిస్తారని ప్రశ్నించగా ఈనెల 20వ తేదీ కల్లా తహశీల్దార్‌ను నియమిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిటి హరి రామారావు, ఆర్ఐ బోనెల రామారావు, ప్రవీణ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రలో సగం ఖర్చు సుగర్ ఫ్యాక్టరీలపై పెడితే
రైతులకు ప్రయోజనం : భీశెట్టి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విశాఖలో నిర్వహిస్తున్న యోగా కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న ఖర్చులో సగం మన జిల్లాలోని సుగర్ ఫ్యాక్టరీలపై పెట్టుంటే రైతులకు ప్రయోజనం కలుగుతుందని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ అన్నారు. గురువారం లోక్‌సత్తా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖపట్నంలో నిర్వహించ తలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం మంచిదే అయినా,నిర్వహణ ఖర్చులో సంగం ఉత్తరాంధ్ర లోని మూత పడ్డ తాండవ, ఏటికొప్పాక, అనకాపల్లి, భీమసింగి, నష్టాల్లో తిరుగుతున్న చోడవరం సహకార చక్కెర ఫ్యాక్టరీల పై పెట్టివుంటే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని అన్నారు. గడచిన నెలరోజుల నుండి ఉత్తరాంధ్ర లోని ఒక్క అధికారి ప్రజా సమస్యలపై పనిచెయ్యలేని పరిస్థితి నెలకొందని, ఎవ్వరితో మాట్లాడినా యోగాంధ్ర మీటింగ్, యోగాంధ్ర ఏర్పాట్లు అని చెబుతున్నారని అన్నారు. పాలన వ్యవస్థ పూర్తిగా కుంటుపడిందన్నారు. గత ప్రభుత్వాల పనికి మాలిన నిర్వాకంతో సహకార చక్కెర ఫ్యాక్టరీలు మూత పడ్డాయని, గత ఐదు సంవత్సరాల గా కార్మికులకు,ఉద్యోగులకు పిఎఫ్, గ్రాట్యుటీ చెల్లించలేదని, కూటమి ప్రభుత్వం వచ్చి యేడాది పూర్తి చేసుకున్నా అదే పరిస్థితి నెలకొందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈవెంట్లపై దృష్టి సారించకుండా ఉత్త రాంధ్ర లోని మూత పడ్డ పరిశ్రమలపై, యువతకు ఉపాధి అవకాశాల కోసం,రైతులకు లాభసాటి వ్యవవసాయం కోసం దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రతినిధి అల్లంశెట్టి నాగభూషణం, పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ క్లీనర్ మృతి

ప్రజాశక్తి- డెంకాడ

విజయనగరం నుంచి నాతవలసకు వెళ్లే రహదారిలో డెంకాడ మండలం పెద తాడివాడ వద్దా శ్రీవెంకటలారీ ట్రాన్స్ పోర్టు ఆఫీసు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని బుధవారం అర్ధరాత్రి లారీ క్లీనర్ మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం.. చిత్తూరు జిల్లాకు చెందిన లారీ క్లీనర్ యానాది రవి(36) చిత్తూరు నుంచి టమాటో లోడుతో విజయనగరం డ్రైవర్‌తో కలిసి వచ్చాడు. పని పూర్తయిన తరువాత తిరిగి ప్రయాణంలో పెద్దతాడివాడ వద్ద లారీని నిలిపేసి బహిర్భూమికి వెల్లివచ్చి రోడ్డును క్రాస్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన క్లీనర్ రవి అక్కడికక్కడే చనిపోయాడు. విషయం తెలిసిన వెంటనే డెంకాడ పోలీస్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా సర్వజన ఆసుపత్రికి తరలించారు.

Change of Name

I,Karanapu Ramu,S/o K.Asirayya,R/oThatipudi, Vijayanagaram, Vijayanagaram Dt, A.P-535218. have changed my name KARANAPU RAMU to KARNAPU RAMU same as intimated to General Public.

Change of Name

I,Karanapu Ramanamma,W/o K.Ramu,R/oThatipudi, Vijayanagaram, Vijayanagaram Dt, A.P- 535218. have changed my name KARANAPU RAMANAMMA to KARNAPU RAMANAMMA same as intimated to General Public.